సాక్షి ఏలూరు

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



నేత్రపర్వంగా తిరువీధి సేవ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా చినవెంకన్న ఉభయ దేవేరులు, గోదాదేవితో తిరువీధి సేవ నేత్రపర్వంగా సాగింది.



లక్ష్మీగణపతి హోమం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.




ఇళ్లకు శోభ.. వారికి ఉపాధి

రాజస్తాన్‌కు చెందిన 300కు పైగా కుటుంబాల వారు బొమ్మల తయారీని వృత్తిగా చేసుకొని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జీవనం సాగిస్తున్నారు. IIలో ▸

న్యూస్‌రీల్

మద్దికి సహాయ కమిషనర్ హోదా



ఆంజనేయస్వామి దేవస్థానం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డి గూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని సహాయ కమిషనర్ హోదాలో చేరుస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ జీఓ విడుదల చేసింది. ఆలయానికి వచ్చే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రస్తుతం 6(ఏ) కేడర్‌లో గ్రేడ్–1 ఈవో కంట్రోల్‌లో ఉన్న క్షేత్రాన్ని సహాయ కమిషనర్ హోదాలోకి మార్చారు. వరుసగా మూడేళ్లపాటు ఏడాదికి రూ.2 కోట్ల నుంచి రూ.7 కోట్ల ఆదాయం వచ్చే ఆలయాలు సహాయ కమిషనర్ కేడర్‌లోకి వస్తాయి. మద్ది క్షేత్రానికి రూ.2 కోట్ల పైబడి ఆదాయం రావడంతో ఈ హోదాలోకి ప్రభుత్వం చేర్చింది.

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం

ఏలూరు(మెట్రో): గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలు జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే మూడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తామన్నారు. లింగ నిర్ధారణ చేసేవారి వివరాలను టోల్ ఫ్రీ 102, 104కు తెలియజేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలు పీసీ అండ్ పీఎన్‌డీటీ నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. ఒకరు లేదా ఇద్దరు ఆడ పిల్లలు కలిగి గర్భస్రావం చేయించుకునే వారి నుంచి కారణం తెలుసుకోవాలని, చట్టాన్ని అతిక్రమించి గర్భస్రావం చేయించుకున్న, వారికి సహకరించిన వారిపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. స్కానింగ్ కేంద్రాలపై ఆకస్మిక, డెకాయ్ నిఘా తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రజల్లో చట్టంపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ డా.శర్మిష్ట, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ పాల్ సురేష్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆశా పాల్గొన్నారు.

'అమృత్ భారత్'కు ఏలూరులో హాల్ట్

ఏలూరు (టూటౌన్): ప్రధాని మోదీ ప్రారంభించిన మాల్దా టౌన్–ఎస్ఎంవీటీ బెంగళూరు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఏలూరులో హాల్టు ఉందని రైల్వేస్టేషన్ మేనేజర్ ఎన్.రమేష్ తెలిపారు. దేశంలో తొలిసారిగా రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించారని ఇందులో ఒకటి ఇది అన్నారు. ఈ రైలు ఆదివారం మాల్దా టౌన్ నుంచి, మంగళవారం ఎస్ఎంవీటీ బెంగళూరు నుండి వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా నడుస్తుందన్నారు.

నేడు ఏలూరు రాక

దెందులూరు: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రత్యేక కృషితో అమృత్ భారత్ రైలుకు ఏలూరులో హాల్ట్ వచ్చిందని దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఏలూరు ఎంపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం 6.18 గంటలకు ఎంపీ కోటగిరి శ్రీధర్, తాను రైలును ప్రారంభిస్తామన్నారు. ఈ మేరకు తనకు ప్రారంభోత్సవ ఆహ్వానం వచ్చిందన్నారు.

బాలోత్సవంతో సృజనాత్మకత

భీమవరం: బాలల సాహిత్యం, కళలు, చరిత్ర తెలుసుకునేందుకు అవగాహన, ఆసక్తి, ఆలోచన, నైపుణ్యం సృజనాత్మకతను కలిగించేలా బాలోత్సవం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక చింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాలలో బాలోత్సవం ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు మాట్లాడుతూ బాలోత్సవాల ద్వారా బాలల్లో ప్రతిభ పెంపొందించవచ్చన్నారు. డీఈఓ ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ యూటీఎఫ్, అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం, వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. హేలాపురి బాలోత్సవం కార్యనిర్వాహక కార్యదర్శి జీవీఎల్ నర్సింహరావు, డీఎన్నార్ కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

సంక్షేమ సంబరం


సంక్షేమనామ సంవత్సరం ఇది. గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పం జిల్లాలో పక్కాగా అమలవుతుంది. ప్రతి నెలా ఒకటో తారీఖున వేకువజామున అందించే పింఛన్ మొదలు పథకాలన్నీ పారదర్శకంగా లబ్ధిదారులకు అందుతున్నాయి. ఇలా వందల కోట్ల నగదు లక్షలాది మంది ఖాతాల్లో జమవుతోంది. వీటితో పాటు ఈ ఏడాది ఏలూరు జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రారంభంతో పాటు కీలక అభివృద్ధి పనులు జరిగాయి.

గడపగడపకూ పథకాల లబ్ధి

- 13,046 ఎకరాలు పేదలకు పంపిణీ
- ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల
- నవరత్నాలతో మహిళల ఖాతాల్లోకి నగదు
- మహిళా మార్టులతో ఉపాధికి బాటలు
- ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం



ఏలూరులో జగనన్న తోడు లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ (ఫైల్)



సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఏలూరు జిల్లా ప్రజల సుదీర్ఘ స్వప్నం ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణం పూర్తయ్యింది. 120 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాల ప్రారంభమైంది. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో సమగ్ర రీతిలో రూ.500 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. జిల్లా చరిత్రలో ప్రభుత్వ వైద్యకళాశాల శాశ్వతంగా నిలిచిపోనుంది. అలాగే సంక్షేమ పథకాల అమలులో జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో కొనసాగుతుంది. ఈ ఏడాది జిల్లాలో 6,938 రైతులకు కొత్తగా రైతుభరోసా పథకంలో చేర్చి సాయాన్ని నేరుగా ఖాతాల్లోకి జమ చేశారు. గతేడాది జిల్లాలో 1,98,061 మందికి రూ.152.66 కోట్లు జమ చేయగా ఈ ఏడాది 2,04,999 మందికి రూ.162.24 కోట్లు అందించారు.

అక్షరానికి అగ్రాసనం

జిల్లాలో 12,72,135 మంది విద్యార్థులకు రూ.40.79 కోట్లతో జగనన్న గోరుముద్ద పథకం, 1,55,995 మందికి రూ.38.99 కోట్లతో జగనన్న విద్యాకానుక, 1,72,956 మందికి రూ.259.43 కోట్లను అమ్మఒడి పథకం కింద ప్రభుత్వం ఖర్చు చేసింది. రెండో విడత మొదటి భాగంలో రూ.293.73 కోట్లతో 883 పాఠశాలల్లో, రెండో భాగంలో రూ.12.82 కోట్లతో 695 పాఠశాలలు, మూడో భాగంలో రూ.11.23 కోట్లతో 1,012 పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిర్వహించారు. 33,655 మంది తల్లుల ఖాతాల్లో రూ.77.75 కోట్లను జగనన్న విద్యాదీవెన, రూ.30.96 కోట్లను 32,316 మంది తల్లుల ఖాతాల్లో వసతి దీవెన కింద జమచేశారు.

లేఅవుట్లలో విద్యుత్ కాంతులు

జిల్లావ్యాప్తంగా 778 లేఅవుట్లలో 83,825 ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. వీటిలో 28,380 నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ క్రమంలో విద్యుత్ శాఖ 24,215 ఇళ్లకు రూ.16.72 కోట్లతో నూతన సర్వీస్ కనెక్షన్లు, రూ.19.97 కోట్లతో 33/11 కేవీ సబ్ స్టేషన్లను, రూ.1.14 కోట్లతో 112 డిస్ట్రిబ్యూటర్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశారు. విద్యుత్ శాఖ వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్‌ను పంపిణీ చేయడానికి రూ.383.99 కోట్ల సబ్సిడీగా కేటాయించింది. 4,818 మంది ఆక్వారైతులకు రూ.26.63 కోట్ల విద్యుత్ సబ్సిడీ మంజూరు చేసింది.

దశాబ్దాల అనంతరం భూ పంపిణీ

2004 తరువాత జిల్లాలో భూ పంపిణీ ఈ ఏడాదే జరిగింది. అది కూడా రాష్ట్రస్థాయి భూ పంపిణీ కార్యక్రమాన్ని నూజివీడు నుంచి సీఎం జగన్ ప్రారంభించారు. జిల్లాలో 522.90 ఎకరాల భూమిని 653 మంది రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. అలాగే 415.68 ఎకరాల సర్వీస్ ఇనామ్ భూములను 511 మందికి పంపిణీ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ల్యాండ్ పర్చేజ్ కింద 391.45 ఎకరాల భూమిని 611 మందికి పంపిణీ చేశారు. 2003 ముందు ఉన్న 11,716.35 ఎకరాల అసైన్డ్ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి 9,172 రైతులకు ప్రయోజనం చేకూర్చారు. అలాగే 106 గ్రామాల్లో 1,37,109 ఎకరాల్లో రీసర్వేను మొదటి విడతలో పూర్తి చేశారు.

సంక్షేమ ఫలాలు

- జిల్లాలో 2,78,519 మంది పింఛన్ దారులకు ప్రతినెలా రూ.77.31 కోట్లు అందిస్తున్నారు. కొత్తగా ఈ ఏడాదిలో 25,125 పెన్షన్లను పెంచారు.
- స్వయం సహాయక బృందాలకు బ్యాంక్ లింకేజీల ద్వారా 19,427 గ్రూపులకు రూ.1485.23 కోట్ల రుణాలు అందించారు. 20,814 గ్రూపులకు రూ.144.15 కోట్ల స్త్రీ నిధి రుణాలు మంజూరు చేశారు. సున్నా వడ్డీ పథకం ద్వారా 39,689 గ్రూపులకు రూ.52.78 కోట్లు జమ చేశారు.
- చేయూత మహిళా మార్ట్‌లు రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచాయి. జిల్లాలో జంగారెడ్డిగూడెం, చింతలపూడిలో ఏర్పాటు చేసిన మార్ట్‌లు రూ.2.60 కోట్ల టర్నోవర్ మార్క్‌ను దాటాయి.
- చిరువ్యాపారులకు ఇచ్చే జగనన్న తోడు పథకంలో భాగంగా 10,130 మందికి రూ.10.13 కోట్లు అందించారు.
- జిల్లాలో 1,380 మందికి వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకం కింద రూ.10.79 కోట్లు అందజేశారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు 163 దరఖాస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించే ఇళ్ల స్థలాల కోసం ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు ఏలూరు జిల్లాలో 163 దరఖాస్తులు అందాయని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాస్థాయి హౌసింగ్ కమిటీ సమావేశంలో జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ విధివిధానాలపై సమీక్షించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం భూమిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఏలూరుకు సంబంధించి మూడు, నాలుగు ప్రాంతాల్లో రోడ్డు కనెక్టవిటీ ఉన్న స్థలాలను తహసీల్దార్ ఆధ్వర్యంలో పరిశీలిస్తామన్నారు. పరిశీలన పూర్తయిన తర్వాత భూ కేటాయింపుపై చర్చిస్తామన్నారు. ఏలూరుకు సంబంధించి 90 దరఖాస్తులు అందాయని, దరఖాస్తులకు గడువు ఉన్నందున దాదాపు ఏడెనిమిది ఎకరాల స్థలం అవసరం ఉంటుందన్నారు. అలాగే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ హెడ్ క్వార్టర్‌లో ముందస్తుగా ఎకరా స్థలాన్ని గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థలాల గుర్తింపులో స్థానిక విలేకరులను భాగస్వామ్యం చేస్తామన్నారు. కమిటీ సభ్యులు కె.కిషోర్, పి.దుర్గామల్లికార్జున్, కె.వెంకటపోతురాజు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం 60:40 శాతం భరించాల్సి ఉందని జీఓలో ఉందని, దీనిని 90:10 శాతం చేయాలని కోరారు. ఈ అంశాన్ని మినిట్స్ రూపంలో ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ తెలిపారు. జేసీ బి.లావణ్యవేణి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, ఏలూరు ఇన్‌చార్జి ఆర్డీఓ గీతాంజలి, డీపీఆర్వో రామచంద్రరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలూ.. సమ్మె విరమించండి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ విజ్ఞప్తి



సమ్మె విరమించాలని కోరుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: పసిపిల్లలు, బాలింతలు, గర్భిణుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సమ్మె విరమించి విధుల్లో చేరాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అంగన్‌వాడీలను విజ్ఞప్తి చేశారు. నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మంత్రి కొట్టు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు దుర్మార్గ పాలనతో అంగన్‌వాడీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ అంగన్‌వాడీలకు చేసిన మేలును సమగ్రంగా వివరించారు. ఇప్పటికే ప్రభుత్వం పలు సమస్యలను పరిష్కరిస్తూ జీఓలు జారీ చేసిందని, మిగిలిన కొన్ని సమస్యల పరిష్కారం కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందన్నారు. అంగన్‌వాడీల సమస్యలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఉదార స్వభావంతో పరిష్కరిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సీఎం జగన్ సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. బాలింతలు, గర్భిణులు, పిల్లల కోసం వేల కోట్లు ఖర్చు చేసి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పోషకాహారాన్ని అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లను సీఎం జగన్‌తో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఎవరి ఉచ్చులో పడొద్దు

అంగన్‌వాడీలు ఎవరి ఉచ్చులోనూ పడవద్దని మంత్రి కొట్టు హితవు పలికారు. వ్యవహారాన్ని తెగే వరకూ లాగవద్దని, వేతనాలు పెంచితేనే సమ్మె విరమిస్తామని మంకుపట్టు పట్టవద్దని అంగన్‌వాడీలకు సూచించారు. సమ్మె కారణంగా బాలింతలు, గర్భిణులు, పిల్లలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. దయచేసి పిల్లల ఉసురు పోసుకోవద్దన్నారు. పరిస్థితిని అర్థం చేసుకుని అంగన్‌వాడీలు వెంటనే సమ్మె విరమించాలని మంత్రి కొట్టు సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

గృహనిర్మాణాలు వేగిరపర్చాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పేదల గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలో గృహనిర్మాణాల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారికి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అవగాహన కల్పించి నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలన్నారు. అప్పటికీ లబ్ధిదారులు చొరవ చూపకపోతే అర్హత కలిగి నిర్మాణాలకు సిద్ధంగా ఉన్న లబ్ధిదారులకు అవకాశం కల్పించాలన్నారు.

అందుబాటులో సర్వే రికార్డులు : జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా రెండు విడతల్లో 70 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, ఈ మేరకు రికార్డులన్నీ అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఎటువంటి ఫీజు లేకుండా జాయింట్ ఎల్‌పీఎంను వేరుచేసి ప్రత్యేక ఎల్‌పీఎంగా ఇస్తామన్నారు. క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లను ఎటువంటి ఆటంకాలు ఉండవన్నారు. ఎల్‌పీఎంలను విడగొట్టడం, రిజిస్ట్రేషన్ సమస్యలు ఉంటే గ్రామ సచివాలయంలో సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి సానుకూలం

పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ అంగన్‌వాడీలు వస్తారన్న సమాచారం మేరకు ఉదయం 9.40 గంటల వరకు ఇక్కడే ఉన్నానని.. పాలకొల్లులో ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లాలని చెప్పారు. అయినా అంగన్‌వాడీలంతా తన కార్యాలయం వద్ద ఉన్నారని తెలుసుకుని సగంలోనే నిలిపి వచ్చినన్నారు. అంగన్‌వాడీల వినతిపత్రంపై భీమవరం వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని, సమస్యల పరిష్కారానికి ఆయన సిద్ధం ఉన్నారన్నారు. ప్రభుత్వం తరపు నాయకులు, అంగన్‌వాడీ నాయకుల చర్చల్లో మిగిలినవి కూడా పరిష్కారమవుతాయన్నారు.

టీడీపీ హయాంలో గుర్రాలతో తొక్కించారు

అంగన్‌వాడీలంతా ఒక్క విషయం గుర్తుంచుకోవాలని మీకు ఏమైనా మంచి చేయాలంటే సీఎం జగన్ ఒక్కరే చేయగలరని, గత టీడీపీ హయాంలో చంద్రబాబు అంగన్‌వాడీ కార్యకర్తలను గుర్రాలతో తొక్కించడం, పోలీసులతో దాడి చేయించడం వంటివి మరువద్దని మంత్రి కారుమూరి గుర్తుచేశారు. సీఎం జగన్ మనసున్న వ్యక్తి అని ఆర్థికపరంగా పరిస్థితులను చూసుకుని ఏమాత్రం అవకాశం ఉన్నా అడిగినవన్నీ చేస్తారన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలోనే అంగన్‌వాడీలకు వేతనాలు పెంచారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి తెలుగు యువత నాయకులు



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో పార్టీలో చేరుతున్న తెలుగు యువత నాయకుడు



కైకలూరులో టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు ఆసానిఖాన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

పెనుగొండ: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ దుందుభి మోగించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు పదవి చేపట్టనున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరు మండల తెలుగు యువత నాయకుడు గొల్ల రవిని తూర్పుపాలెంలో శనివారం వైఎస్సార్ సీపీ పార్టీ కండువా కప్పి ఆయన ఆహ్వానించారు. ప్రతిపక్షాలు ఎంతమంది కూటమిగా వచ్చినా ప్రజామద్దతు సీఎం జగన్‌కే ఉందని శ్రీరంగనాథరాజు అన్నారు. సంక్షేమానికి దిక్సూచిగా మారి పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమాన్ని అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. చంద్రబాబును ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పోడూరు మండల కన్వీనర్ పిల్లి నాగన్న, జేసీఎస్ కన్వీనర్ పైడి ఏసుబాబు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, విద్యా మౌలిక సదుపాయాల కల్పన కార్పొరేషన్ డైరెక్టర్ వేణుమాధవరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు నల్లిమిల్లి గోపీ, రుద్రరాజు శివాజీరాజు, దంపనబోయిన బాబూరావు, దిద్దే శ్రీను

కైకలూరు తెలుగు యువత అధ్యక్షుడు చేరిక

కైకలూరు: సీఎం జగన్ ప్రజారంజక పాలనకు ఆకర్షితులవుతూ పలువురు టీడీపీ, జనసేన పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారు. కైకలూరు మండల తెలుగు యువత అధ్యక్షుడు ఆసానిఖాన్, జిల్లా ముస్లిం మైనార్టీ విభాగ కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ ఆధ్వర్యంలో కలిదిండిలో ఎమ్మెల్యే డీఎన్నార్ సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే డీఎన్నార్ వారికి పార్టీ కండవా కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తానని ఆసానిఖాన్ అన్నారు. కార్యక్రమంలో కైకలూరు ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ అబ్దుల్ హమీద్, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ముస్లిం మైనార్టీ విభాగ కమిటీ జాయింట్ సెక్రటరీ షేక్ మూసా, నాయకులు ఎస్‌డీ బాషా, నయీం, అలీం పాల్గొన్నారు.

ఆర్‌టీఐ హెల్ప్‌డెస్క్ ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని రైల్వే జంక్షన్ రోడ్డులో అసోసియేషన్ ఫర్ లీగల్ అండ్ సోషల్ అవర్‌నెస్ (ఆల్సా) ఆర్‌టీఐ కన్స్యూమర్ హెల్ప్ డెస్క్‌ను కన్స్యూమర్ కమిషన్ జిల్లా అధ్యక్షుడు డి.కోదండ రామమూర్తి, ఎస్.సురేష్ కుమార్ శనివారం ప్రారంభించారు. చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. హెల్ప్‌డెస్క్ అండ్ అల్సా ప్రెసిడెంట్ బొమ్మిడి సన్నిరాజ్ మాట్లాడుతూ ఆర్‌టీఐ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి హెల్ప్‌డెస్క్‌లు దోహదపడతాయన్నారు.

క్లుప్తంగా

మద్ది అంజన్న సేవలో జడ్జిలు



మద్ది అంజన్నను దర్శించుకున్న జడ్జిలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానాన్ని శనివారం పలువురు జడ్జిలు దర్శించుకున్నారు. ఏలూరు రెండో అదనపు జడ్జి మంగా కుమారి, ఏలూరు పోక్సో కోర్టు జడ్జి సునంద, ఏలూరు ఏఎస్ కోర్టు జడ్జి విజయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వీరికి ఈఓ ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ మర్యాదలతో జడ్జిలను సత్కరించి వేద ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి ప్రసాదాలను అందజేశారు. జంగారెడ్డిగూడెం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్ రాజరాజేశ్వరీ, తేజస్విని పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీకొని కూలీ మృతి



రోశయ్య మృతదేహం

నూజివీడు: గొల్లపల్లి వద్ద శనివారం రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. నూజివీడు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు వెళుతున్న లారీ గొల్లపల్లి వద్దకు వచ్చేసరికి టైర్ పేలింది. దీంతో లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న నూజివీడు నుంచి రేషన్ షాపులకు బియ్యాన్ని తరలిస్తున్న మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బియ్యం లోడుపై ఉన్న సుంకొల్లుకు చెందిన ముఠా కూలీ ముంతా రోశయ్య (43)పై బియ్యం బస్తాలు పడటంతో పాటు లారీ క్యాబిన్ నొక్కుకుపోవడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

చింతలపూడి: చేసిన అప్పులు తీర్చేమార్గం లేక ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన భూక్యా దొరబాబు (32) అన్నావదినల వద్ద ఉంటున్నాడు. ఇటీవల అప్పులు చేసి అవి తీర్చలేక ఇంట్లో ఘర్షణ పడి నాలుగు రోజులుగా బయటే ఉంటున్నాడు. దీంతో మనస్తాపానికి గురై శనివారం ఉదయం నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు ప్రాజెక్టు సమీపంలో చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్లకు శోభ.. వారికి ఉపాధి

కుబేరుడు.. గౌతమ బుద్ధుడు.. గోపిక.. గోపాలుడు.. రాధాకృష్ణులు.. రామచిలుకలు.. లక్ష్మీదేవి.. సరస్వతీదేవి.. బొమ్మ ఏదైనా వారి హస్తకళా నైపుణ్యం అబ్బురపరుస్తుంది. అతి తక్కువ వ్యయంతో ఇంటికి శోభనిస్తుంది. వైట్‌సెమ్ ముద్దకు రూపును కూర్చి.. రంగులు అద్ది.. అందమైన అలంకరణ బొమ్మలను అలవోకగా రూపొందిస్తూ.. వాటికి జీవం పోస్తున్నారు రాజస్తాన్‌కు చెందిన కళాకారులు. వాటిని విక్రయించడం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు.

- వైట్‌సెమ్‌తో కళారూపాల తయారీ
- ఆకట్టుకుంటున్న రాజస్తానీయుల కళానైపుణ్యం
- చవితికి ముందు గణేష్ ప్రతిమలు, తర్వాత కళాకృతుల తయారీతో ఉపాధి
- రూ.50 నుంచి రూ.1200 వరకు ధర
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో ఉపాధి పొందుతున్న 300కు పైగా రాజస్తానీ కుటుంబాలు

సండే స్పెషల్

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్ : రాజస్తాన్‌కు చెందిన 300కు పైగా కుటుంబాల వారు బొమ్మల తయారీని వృత్తిగా చేసుకొని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జీవనం సాగిస్తున్నారు. ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, అత్తిలి, కవిటం తదితర ప్రాంతాల్లో నివసిస్తూ రోడ్లపక్కన శిబిరాలు ఏర్పాటుచేసుకుని ఇంటిల్లిపాదీ బొమ్మల తయారీలో నిమగ్నమవుతున్నారు. వినాయక చవితి వేడుకల కోసం గణనాథుని విగ్రహాల తయారీకి వీరు అధిక ప్రాధాన్యమిస్తారు. చవితి వేడుకలకు ఆరు నెలల ముందు నుంచే విగ్రహాల తయారీ మొదలు పెడతారు. ఒక అడుగు నుంచి 15 అడుగుల వరకు విగ్రహం తయారీకి మూడు నుంచి వారం రోజుల సమయం పడుతుంది. విగ్రహం సైజు, డిజైన్‌ను బట్టి రూ.3000 నుంచి రూ.50 వేలు వరకు ధర పలుకుతుంది.

షోకేస్ బొమ్మలకు ఆదరణ...

వినాయక చవితి వేడుకలు ముగిశాక ఉపాధి కోసం .. ఇళ్లకు శోభను తెచ్చే అలంకరణ బొమ్మలను తయారుచేస్తుంటారు. రాధాకృష్ణులు, రామచిలుకలు, గోపికలు, గౌతమ బుద్ధుడు, దేవతామూర్తులు, కుబేరుడు, పూలకుండీలు, సైనికులు, అడవి జంతువులు, పక్షులు తదితర బొమ్మలను అరడుగు ఎత్తు నుంచి మూడు అడుగుల ఎత్తు వరకు తయారుచేస్తుంటారు. ఉత్సవాలు, జాతర్లలోను, రద్దీ రోడ్లలో రోడ్ల పక్కన, తోపుడు బండ్లపై ఇంటింటికీ తిరుగుతూ వీటిని విక్రయించి ఉపాధి పొందుతున్నారు. వీటికి ప్రజల నుంచి కూడా విశేష ఆదరణ ఉంది. రంగు రంగుల్లో రూపొందించిన ఈ బొమ్మల కొలువులు చూపరులకు కనువిందు చేస్తుంటాయి. దారిన వెళ్లే ప్రయాణికులు ఆగి తమకు నచ్చిన బొమ్మలను కొనుగోలు చేస్తుంటారు. బొమ్మను బట్టి రూ.50 నుంచి రూ.1200 వరకు ధర పలుకుతాయి. ఈ అలంకరణ బొమ్మల విక్రయం ద్వారా ఖర్చులు పోగా ఒక్కో బొమ్మకు రూ.10 నుంచి రూ.100 వరకు మిగులుతుందని కళాకారులు తెలిపారు.



విక్రయించేందుకు రోడ్డుపక్కన ఉంచిన బొమ్మలు

బొమ్మల తయారీ ఇలా...

వైట్‌సిమెంట్ మిశ్రమాన్ని పేస్టుగా తయారు చేస్తారు. ఆయా రకాల ఆకృతుల్లో ముందే సిద్ధం చేసి ఉంచిన రబ్బరు ఫ్రేముల్లో ఈ మిశ్రమాన్ని పోస్తారు. కొద్దిసేపటి తర్వాత వాటికున్న రబ్బరు ఫ్రేములను తొలగించి బొమ్మలను ఎండలో ఆరబెడతారు. అవి గట్టిపడిన తర్వాత బొమ్మను బట్టి వాటికి రంగులు అద్దుతారు. ఈ రకంగా పర్యావరణానికి హాని కలగని రీతిలో ప్రభుత్వ నిబంధనల మేరకు పలు జాగ్రత్తలను తీసుకుంటున్నట్టు కళాకారులు చెబుతున్నారు. బొమ్మలకు వేసే ఫ్లోరసెంట్, రేడియం రంగులను పూర్తిగా నిషేధించడంతో సహజమైన అద్దకపు రంగులు వినియోగిస్తున్నామని చెప్పారు. దీని వల్ల కాలుష్యం ఉండదని వారంటున్నారు. ఈ కళారూపాల తయారీ తమకు వారసత్వంగా వస్తోందని, తమ పూర్వీకులు మట్టితో బొమ్మలు తయారు చేసేవారని, మారుతున్న కాలానికి అనుగుణంగా వైట్ సిమెంట్‌తో బొమ్మలు తయారుచేయడం అధికమైందని చెప్పారు. తమ రాష్ట్రానికి చెందిన వందల కుటుంబాలు ఎన్నో ఏళ్ల క్రితమే ఆంధ్రాకు వలస వచ్చి బొమ్మల తయారీ చేస్తున్నాయని, రాజస్తాన్‌లోని పాలీ జిల్లాకు చెందిన కళాకారుడు కిషన్ తెలిపాడు.



కుబేరుడు



రామచిలుకలు



గౌతమ బుద్ధుడు



గోపిక

కోవిడ్ కష్టకాలంలో బొమ్మలే దారి చూపాయి

అధిక సంఖ్యలో వినాయక విగ్రహాల తయారీకి వీరు అప్పులు చేసి పెట్టుబడులు పెడుతుంటారు. కరోనా మహమ్మారితో రెండేళ్ల పాటు గణేష్ ఉత్సవాలు జరగకపోవడంతో విగ్రహాలు అమ్ముడుపోక చాలా ఇబ్బంది పడ్డామని కళాకారులు తెలిపారు. ఆ సమయంలో షోకేస్ బొమ్మలను తయారు చేసి ఇంటింటికీ తిరిగి అమ్మకాలు చేయడం ద్వారా ఉపాధి పొందేవారమని వివరించారు. గత ఏడాది నుంచి వినాయక ప్రతిమల అమ్మకాలు పెరిగినట్టు తెలిపారు.





ఉత్సవాల్లో విక్రయించేందుకు రిక్షాలపై బొమ్మలు తీసుకువెళుతున్న కళాకారులు, రంగులు అద్దేందుకు ఆరబెట్టిన బొమ్మలు

బొమ్మల తయారీనే వృత్తి



రాజస్తాన్‌కు చెందిన మా కుటుంబం చాలాకాలం క్రితం భీమవరం ప్రాంతానికి వలస వచ్చింది. చిన్నతనం నుంచి బొమ్మల తయారీ మా వృత్తి. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ఎన్నో వందల కుటుంబాల వారు వినాయక విగ్రహాలు, షోకేస్ బొమ్మల తయారీతో ఉపాధి పొందుతున్నాం.

ముఖేష్, హస్త కళాకారుడు, రాజస్తానీయుడు

కొండరెడ్డి గిరిజనులకు త్వరలో పక్కా గృహాలు



రెడ్డి కుంకాలలో కొండరెడ్డి గిరిజనులకు ఆయుష్మాన్ భారత్ తదితర కార్డులను అందజేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: మారుమూల కొండరెడ్డి గిరిజన గ్రామాల్లో ప్రతి కొండరెడ్డి కుటుంబానికి పక్కా గృహంతోపాటు మౌలిక వసతులు కూడా కల్పిస్తామని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శి సుశీల్ బండింగ్ అన్నారు. పోలవరం మండలం రెడ్డికుంకాల కొండరెడ్డి గిరిజన గ్రామంలో శనివారం ఆయన ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కొండరెడ్డి గిరిజనులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి జీవన విధానం, స్థితిగతులు, పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీవీటీజీల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. పక్కాగృహం నిర్మాణంతో పాటు తాగునీరు, విద్యుత్ కనెక్షన్, రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, సబ్‌సెంటర్‌ల నిర్మాణాలు, టాయిలెట్‌లు వంటి వసతులు కల్పించడంతో పాటు మొబైల్ టవర్‌ల నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో సూర్యతేజ మాట్లాడుతూ ఈ పథకంపై కొండరెడ్డి గిరిజనులకు అవగాహన కల్పించేందుకు మండల స్థాయి అధికారులు ఇప్పటికే గ్రామ సభలు నిర్వహించారన్నారు. ఐటీడీఏ పరిధిలో 86 హ్యాబిటేషన్‌లు ఉన్నాయని, సుమారు 10 వేల మంది కొండరెడ్డి గిరిజనులు ఉన్నారన్నారు. కేంద్రం ఈ పథకానికి రూ.24 వేల కోట్లు మంజూరు చేసిందని, వాటిలో 20 శాతం నిధులు రాష్ట్రానికి కేటాయించిందన్నారు. ఈ నిధులతో ఆయా గ్రామాలు ఎంతో అభివృద్ధి సాధిస్తాయన్నారు. కొండరెడ్డి గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆయా గ్రామాల్లో వారికి కావాల్సిన అన్ని వసతులు సమకూర్చుకోవచ్చన్నారు. గృహాలు కూడా త్వరలో మంజూరు చేస్తారన్నారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఈ పథకంలో వసతులకు సంబంధించిన కార్డులు కూడా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, సర్పంచ్ కోటం గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు మిడియం సింగరాజు, కరిబండి నాగరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధైర్యం, తెగువ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగనే నేడు రాష్ట్ర ప్రజలకు కావాలని ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎడ్వర్డ్ మాట్లాడుతూ 1998వ సంవత్సరంలో డీఎస్సీ రాసి అర్హత సాధించినా అప్పటి ప్రభుత్వాలు తమకు ఉద్యోగాలు ఇవ్వలేదని, అప్పటి నుంచి తాము ఉద్యోగాల కోసం అనేక పోరాటాలు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగాలు కల్పించాలని, తమ కుటుంబాలను ఆర్థిక ఇబ్బందులను గట్టెక్కించాలని పాతికేళ్లుగా ఎంతో మంది ముఖ్యమంత్రులను కోరినా పట్టించుకోలేదన్నారు. ఈ తరుణంలో పాదయాత్రలో తమ కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్ ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత తమకు ఉద్యోగాలిచ్చి తమ జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు అంగలూరి రాజు, కొండే స్వామిదాసు, సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.జోసెఫ్ రాజు, వీ.సంతోష్, టీ.అంజిబాబు, పీ.కరుణానిధి, డీ.ఏసుపాదం, ఎం.సుధారాణి, జీ.గ్రేస్, కే.మంజుల, సీహెచ్. ఉష, ఉమ్మడి జిల్లా పరిధిలోని అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. ఇద్దరిపై హత్యాయత్నం కేసు

జంగారెడ్డిగూడెం: ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ బి.విద్య శనివారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన అంబటి హరీష్ కారు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతనికి తెలిసిన షేక్ బాషా, సత్యవరప్రసాద్ జైలుకు వెళ్లగా, వారికి బెయిల్ నిమిత్తం కొందరు ఇచ్చే డబ్బును షేక్ బాషా భార్యకు ఇవ్వాలని చెప్పారు. అలాగే హరీష్ డబ్బు తీసుకువెళ్లి బాషా భార్యకు ఇచ్చాడు. అయితే ఈనెల 29న బైపాస్ రోడ్డులో హరీష్ వద్దకు వెళ్లి తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకుంటావా అంటూ బాషా, అతనితో వచ్చిన సత్యవరప్రసాద్‌లు హరీష్‌ను తీవ్రంగా కొట్టి గాయపరిచారు. దీంతో హరీష్ స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ చెప్పారు.

బొబ్బనపల్లిలో చోరీ

వీరవాసరం: బొబ్బనపల్లిలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామంలోని కుక్కల శ్రీనివాసరావు భార్య శుక్రవారం పుట్టింటికి వెళ్లగా, శ్రీనివాసరావు ఇంటికి తాళం వేసి వేరే ఇంట్లో నిద్రించాడు. శుక్రవారం రాత్రి ఇంట్లోకి దొంగలు జొరబడి మూడు కాసుల బంగారం, అర తులం ఉంగరం అపహరించారు.

జగన్ ప్రభుత్వానికి విదేశాల్లోనూ మద్దతు



కొయ్యలగూడెంలో ఇళ్ల భాస్కరరావును అభినందిస్తున్న కార్పొరేషన్ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: దేశ విదేశాలలో సైతం వైఎస్సార్ సీపీ గెలుపును ప్రజలు కోరుకుంటున్నారని స్టేట్ అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు అన్నారు. అమెరికా పర్యటనను ముగించుకుని వచ్చిన సందర్భంగా కొయ్యలగూడెంలో భాస్కరరావును శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలోని పలు నగరాలలో పర్యటించిన సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అక్కడి ప్రజలు మద్దతు పలుకుతున్నారన్నారు. అతిరాస కులస్తుల అభివృద్ధికి, అదేవిధంగా మరో 18 కులాల ఆర్థిక అభివృద్ధికి అక్కడి ఎన్ఆర్ఐలు స్వచ్ఛందంగా సహకరిస్తానికి హామీ ఇచ్చారన్నారు. తేలే వెంకటేశ్వరరావు సంసాని రమేష్, బొమ్మన అన్నవరం, సంసాని కిషోర్, కర్తవ రాజేష్, వీరబాబు పాల్గొన్నారు.

దళిత ఉపాధ్యాయుడిని ఆదుకుంటాం

- ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్
- వేగివాడలో కొత్తపల్లి రత్తయ్య ఆత్మహత్యాయత్నంపై విచారణ



వేగివాడ స్కూల్‌లో విచారణ చేస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్

పెదవేగి: వేగివాడలోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం తీరుతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దళిత ఉపాధ్యాయుడు కొత్తపల్లి రత్తయ్యకు న్యాయం జరిగేలా ఆదుకుంటామని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ చెప్పారు. శనివారం వేగివాడలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సంబంధిత అధికారులు, పాఠశాల యాజమాన్యాన్ని విక్టర్ ప్రసాద్ విచారణ చేసి పలు విషయాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయుడు రత్తయ్యను అన్నివిధాలా ఆదుకునేలా పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని స్కూలు యాజమాన్యాన్ని ఆదేశించారు. అలాగే రత్తయ్యకు న్యాయం చేకూర్చే ప్రక్రియపై డీఈఓ, డీఎస్పీ పర్యవేక్షించాలని సూచించారు. విచారణలో డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఏలూరు ఇన్‌చార్జి ఆర్డీఓ గీతాంజలి, డీఈఓ శ్యామ్‌సుందర్, సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముదినీసింగ్, స్కూల్ ప్రిన్సిపాల్ సిరిపుష్పం, సీఐ పి.రాజేష్, ఎంఈఓ సీహెచ్ బుద్ధవాస్, తహసీల్దారు ఎన్.నాగరాజు పాల్గొన్నారు.